
www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 29 మార్చి 2024





పోలీసుల కవాతు

ప్రజాశక్తి -ఉలవపాడు : సార్వత్రిక ఎన్నికల ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో మండలంలో ఉలవపాడు, కరేడు, అలగా పాలెం, చిన్న పల్లిపాలెం గ్రామాలలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఉలవపాడు ఎస్ఐ బాజిరెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రతి ఓటరు స్వచ్ఛందంగా, ప్రశాంతంగా తన ఓటును సద్వినియోగం చేసు కోవాలని ఆయన కోరారు. ఎన్నికల నియమాలను చట్టాలను వ్యతిరేకించినవారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



'టిడిపి' కార్పొరేట్ రాజకీయం..!

> టిడిపికి ఎంతో రాజకీయ చరిత్ర ఉంది..ఎందరో నేతలను, కార్యకర్తలను అందించింది..నాలుగు దశాబ్ధాలు రాజకీయాలు చేస్తున్న ఆపార్టీ ఇప్పుడు కార్పొరేట్ గుప్పెట్లో చిక్కుకుందని ఆపార్టీ నేతలు వాపోతున్నారు..ఎన్నికలు వస్తే పార్టీ జిల్లా కార్యాలయం నుంచి కార్యకలాపాలు జరిగేవి..పార్టీ కార్యాలయం నేతలు, కార్యకర్తలతో ఉత్సాహంగా కనిపించేది. ఇప్పుడు ఆపార్టీకి ఆ పరిస్థితి కనిపించడం లేదు.. ఇప్పుడు ఆ కార్యాలయంలో శ్మశాన వైరాగ్యం అలముకుంటుంది..వ్యక్తుల చుట్టూ పార్టీ కార్యకపాలు సాగుతున్నాయి..రాబిన్‌శర్మ టీమ్ ఏది చెబితే అదే సాగుతోంది..బ్యానర్ కట్టేదగ్గర నుంచి, నేతల ఏర్పాట్లు, పబ్లిసిటీ అంతా కార్పొరేట్ వ్యక్తులు నడుపుతున్నారు. పార్టీ పరిస్థితి చూసి సీనియర్ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేట్ రాజకీయాలు సాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

-ఉత్సవ విగ్రహంగా పార్టీ ఆఫీసు
-వ్యక్తుల చేతుల్లో కార్యకలాపాలు
-నేడు చంద్రబాబు రాక



నెల్లూరులో నిర్మానుషంగా ఉన్న ఎన్‌టిఆర్ ట్రస్ట్ భవన్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలోనే అత్యధిక నేతలు, కార్యకర్తలు కలిగిన పార్టీ అని పార్టీ నేతలు చెబుతుంటారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఇటీవల కాలంలో కొన్ని కార్యక్రమాలు ఆపార్టీ నేతలు చేపట్టారు. ఎప్పుడు, నేతలు కార్యకర్తలతో కళకళలాడే ఆపార్టీ కార్యాలయం ఇప్పుడు బోసిపోతోంది. ప్రస్తుతం జరుగుతోన్న ఎన్నికల్లో పార్టీలో పనిచేస్తున్న నేతలకు కాకుండా కొత్తగా పార్టీలో చేరిన వారికి టికెట్లు ఇవ్వడంతో ఆపార్టీ సీనియర్ నేతలు ఎవరూ పట్టించుకోవడం లేదు. చంద్రబాబు, నారా లోకేష్ కార్యక్రమాల సమయం వరకు కలిసి మెలిసి తిరిగిన నేతలు ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఒకప్పుడు పార్టీ కార్యాలయం నుంచి జరిగే కార్యక్రమాలు, ఎన్నికల నిర్వహణ మొత్తం వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయిందని పార్టీ నేతలు ఆవేదన చెందుతున్నారు. మినీబైపాస్‌లోని ఎన్‌టిఆర్ ట్రస్ట్ భవన్‌లో మనిషి కనిపించడం లేదు. నెల్లూరు ఎంపి అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్లు ప్రకటించినప్పటి నుంచి ఆయా నియోజకవర్గాల నేతలంతా మినీబైపాస్‌లోని వారి నివాసంలోనే దర్శనం ఇస్తున్నారు. జిల్లా వ్యాపితంగా ప్రతి రోజూ వందలాది కార్లు దర్శనమిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే జనంతో వారి కార్యాలయం కళకళలాడుతోంది. ఉదయం 8 నుంచి రాత్రి 11 గంటల వరకు సందడి సందడిగా కనిపిస్తుంది. నెల్లూరు నగర అభ్యర్థిగా పోటీచేస్తున్న పి.నారాయణ గోమతి నగర్‌లోని తన కార్యాలయం నుండే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నగర నేతలు, కార్యకర్తలతోపాటు, ప్రజలు దర్శనమిస్తున్నారు. అక్కడ నుంచే ఎన్నికల ప్రచారాలు సాగుతున్నాయి. ఇక్కడ నగర నేతలంతా మకాం పెడుతున్నారు. నెల్లూరు రూరల్ అభ్యర్థిగా పోటీచేస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కార్యాలయం రోజు చేరికలతోనూ, సమావేశాలతోనూ సాగుతోంది. జిల్లాలోని ఇతర నేతలు ఆయా నియోజకవర్గాల్లో తమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో పార్టీ వ్యవహారాలు, ప్రచారాలు, సర్వేల పేరుతో రాబిన్ శర్మ దిగినప్పటి నుంచి నేతలకు ఏ పనిలేకుండా పోయిందని తెలుస్తోంది. ఫ్లెక్సీలు, స్వాగత ఏర్పాట్లు, బహిరంగ సభలు అంతా ఆ సంస్థ ప్రతినిధులే చూస్తున్నారు. ఓవైపు పార్టీలోకి వచ్చిన వ్యాపారవేత్తలు, మరో వైపు కార్పొరేట్ సంస్థ ఆధీనంలో టిడిపి ఉందని ఆపార్టీ నేతలే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్టీలో ఎన్నో ఏళ్ల నుంచిఉన్న నేతలను పక్కన పెట్టి, వ్యాపారవేత్తలు, కార్పొరేట్ శక్తుల చుట్టూ పార్టీ తిరుగుతుందనే ప్రచారం సాగుతోంది. గత ఎన్నికల సమయంలో ఎన్‌టిఆర్ ట్రస్ట్ భవన్‌లో షామియానాలు, మంచినీళ్ల వంటి ఏర్పాటు చేసి, ఎప్పుడు పది మంది వ్యక్తులు అక్కడే కనిపించే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఒక్కరు , ఇద్దరూ కూడా అక్కడ కనిపించడం లేదు. శ్మశాన వైరాగ్యం కనిపిస్తోంది. పరిస్థితి ఇలానే ఉంటే పార్టీ ఏమిటనే ఆపార్టీ సీనియర్ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాకెందుకులే అంటూ మౌనంగా ఉంటున్నారు..

నేడు చంద్రబాబు రాక..!

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు నేడు జిల్లాకు రానున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు హెలికాప్టర్‌లో కావలి జెడ్‌పి హైస్కూల్ ప్రాంగణానికి వస్తారు. అక్కడ నుంచి స్థానిక ఎన్‌టిఆర్ సర్కిల్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరర హెలికాప్టర్‌లో వింజమూరు వెళతారు. అక్కడ రోడ్ షో నిర్వహించి బహిరంగ సభలో పాల్గొంటారు. రాత్రికి అక్కడే బస చేసి, జిల్లాలో పార్టీ విజయవకాశాల గురించి నేతలతో చర్చించనున్నారు.

నగదు స్వాధీనం

ప్రజాశక్తి-గుడ్లూరు : స్థానిక పోలీసులు గుడ్లూరు, కందుకూరు రహదా రీ లో వాహనాలు తనిఖీలు చేస్తుండగా రాళ్లపాడు కు చెందిన ఓ వ్యక్తి దగ్గర 99,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. నగదుకి ఎలాంటి రసీదులు గానీ, ఆధారాలు లేకపోవడంతో నగదు స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తికి రసీదు ఇచ్చారు. ఎలాంటి అనుమతులు లేకుండా నగదు తరలించ రాదని ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరు నిబంధన ప్రకారం నగదు తీసుకొ నీ పోవచ్చునని ఎస్ఐ తెలిపారు.



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-నెల్లూరు

కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సాత్విక శ్రీ 10వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పాప తల్లిదండ్రులు సురేష్, మౌనిక ఆర్థిక సహాయంతో కొత్తూరు లోని నెహ్రూ భారతి వద్ధుల ఆశ్రమానికి నిత్యావసర వస్తువులు వితరణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఆశ్రమంలోని వద్ధులకు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు.ఈ పీ.హెచ్.పీ జిల్లా గౌరవాధ్యక్షులు అనుముల జయప్రకాష్ , ఈ కార్యక్రమంలో రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, సి.పి అండ్ పీ.హెచ్.పీ.డబ్ల్యు.ఎ అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి గోరంట్ల శేషయ్య, ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనారిటీస్, యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కుడుముల సుబ్బారావు , విశ్రాంత ఏఎస్ఐ మహబూబ్ బాషా , రెహమాన్, ప్రభావతి, రాజేష్ ఉన్నారు.

పోలింగ్ అధికారులకు శిక్షణ



మాట్లాడుతున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

ప్రజాశక్తి -నెల్లూరు : జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి పోలింగ్ అధికారులకు మూడు విడతల్లో శిక్షణ నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.హరి నారాయణన్ వెల్లడించారు. గురువారం స్థానిక నగరంలోని వి.ఆర్ లా కాలేజీ, డీ.కే ప్రభుత్వ మహిళ కళాశాలలో పోలింగ్ అధికారుల కునిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు మూడు విడతల్లో శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహించ డానికి 15వేల మంది పోలింగ్ సిబ్బందిని నియమించామన్నారు. ఎన్నికలు పరిశీలన నిమిత్తం మరో వెయ్యి మంది మైక్రో అబ్జర్వర్ లను నియమించామన్నారు. జిల్లాలో ఎన్నికలు నిర్వహించడానికి మొదటి విడత 2500 మంది సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. శనివారం మరో 2500 మందికి శిక్షణ ఇస్తామన్నారు. పోలింగ్ సిబ్బందికి మరో రెండు విడతలు ఎన్నికలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 12 మంది అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్స్ ను ఏర్పాటు చేశామన్నారు. మాస్టర్ ట్రైనర్ల ద్వారా నియోజకవర్గాలకు సంబంధించి పోలింగ్ అధికారులకు,సహాయ పోలింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణా కార్యక్రమాన్ని పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు సద్వినియోగం చేసుకొని చక్కగా ఎన్నికలు నిర్వహించాలని ఆయన తెలియజేశారు. నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ ,రెవిన్యూ డివిజనల్ అధికారి మలోల ఉన్నారు.

ద్విచక్ర వాహనాలు దగ్ధం

ప్రజాశక్తి-నెల్లూరు : నవాబుపేట పోలీసు స్టేషన్ పరిధిలో ముస్లీం వీధి ప్రాంతంలోని హజరత్తు మహబూబ్ సుభహాని దర్గా సమీపంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నాలుగు ద్విచక్రవాహనాలను దగ్ధం చేశారు. ఈ ఘటనలో గ్లామర్, స్కూటీ ద్విచక్రవాహనాలు పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనపై స్థానికులు అందజేసిన సమాచారం మేరకు పోలీసులకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గతంలో ఇదే ప్రాంతంలో ఒక ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని, ఆకతాయిలు దగ్ధం చేయగా పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేయలేదని స్థానికులు చెబుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తిరిగి మరలా ఇటువంటి ఘటనలు చోటు చేసుకోవడంతో ఏ నిమిషం ఏమి జరుగుతుందో అన్న భయాందోళనలకు గురౌతున్నారు.



జై భారత్ నేషనల్ పార్టీ

కందుకూరు కోఆర్డినేటర్‌గా శివకుమార్

ప్రజాశక్తి-కందుకూరు : జెడి లక్ష్మీ నారాయణ నూతనంగా స్థాపించిన జై భారత్ నేషనల్ పార్టీ కందుకూరు నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా కందుకూరు పట్టణానికి చెందిన పొడపాటిశివ కుమార్(చక్రి) గురువారం విశాఖపట్నంలో జై భారత్ నేషనల్ పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు జేడీ లక్ష్మీనారాయణ చేతుల మీదగా మీదగా నియామ కపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా జేడి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాజకీ యాలలో మార్పు తీసుకు రావడానికి జై భారత్ నేషనల్ పార్టీ అన్నది పుట్టిందన్నారు. జై భారత్ నేషనల్ పార్టీ ముఖ్యంగా యువతరానికి పెద్దపెట్టున వాళ్లకి స్థానం ఇస్తూ, యువతరాన్ని రాజకీయాలలో, రాష్ట్ర అభివద్ధి లో వారి పాత్రను పోషించడానికి జై భారత్ నేషనల్ పార్టీ ప్రోత్సాహం ఇస్తుందని తెలిపారు శివకుమార్ (చక్రి) ని కందుకూరు నియోజ కవర్గ కోఆర్డినేటర్గా నియమించినట్లు తెలిపారు. శివకుమార్ మాట్లాడుతూపార్టీ ఆశయ సాధనకు కృషి చేస్తానన్నారు. తొట్టెంపూడి పృథ్వీ, బెల్లం మనోజ్ పాల్గొన్నారు.



జెడి లక్ష్మీనారాయణ నుంచి నియామక పత్రం అందుకుంటున్న శివకుమార్

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-కందుకూరు : ఎంఎల్ఎ మహీధరరెడ్డికి ముఖ్య అనుచరులుగా ఉన్న జాజుల కోటేశ్వరరావు, దారం మాల్యాద్రి తో వైసిపి అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ జాజుల కోటేశ్వరరావు స్వగహంలో భేటీ అయ్యారు. పార్టీ కోసం తప్పకుండా పని చేయా లని సంఘీభావం తెలిపాలని కోరారు. దారం కృష్ణమనాయుడు, శిగా మస్తాన్, రావులకొల్లు బ్రహ్మానందం వైసిపి నేతలు, కార్యకర్తలు అభిమానులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న బుర్రా మధుసూదన్ యాదవ్



పార్టీలో చేరినవారితో ఇంటూరి నాగేశ్వరరావు

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణంలో టిడిపిలో పలువురు చేరారు. బుధవారం రాత్రి కందుకూరు పట్టణంలోని 27వ వార్డుకు చెందిన అధికార వైసిపికి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆ పార్టీని వీడి టిడిపిలో చేరారు. నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుని బలపరుస్తూ పార్టీలో చేరగా, నాగేశ్వరరావు వారందరికీ ఆత్మీయ స్వాగతం పలికారు. స్థానిక రామాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో శిగా శ్రీను, గోకరాజు మాధ వరావు, ఆకుల నారాయణ,శిగా రమేష్ ఆధ్వర్యంలో తరలివచ్చి నాగేశ్వరరావుతో చేతులు కలిపారు. తొలుత తెలుగుదేశం, జనసేన నాయకులు, కార్యకర్తలు నాగేశ్వరా వుకి పట్ల అభిమానం చాటిచెబుతూ ఘన స్వాగతం పలికారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పట్టణ మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శ్రీను, వార్డు అధ్యక్షుడు పాలంకి ప్రసాద్, వార్డు నాయకులు మేడా మల్లికార్జున, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు సవిడిబోయిన వెంకటకష్ణ, దారం విజయకుమార్, మేడా నరసింగరావు, మల్లికార్జున, ముప్పూరి శివశంకర్, జనసేన పట్టణ పార్టీ అధ్యక్షులు గోకరాజు మదన్, పంది వంశీ, రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చిలకపాటి మధుబాబు, ముస్లిం మైనారిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ రఫీ ఉన్నారు.

పెళ్లింట పెను విషాధం..!

-కారు అదుపుతప్పిన ఘటనలో ముగ్గురు మృతి
-చిన్నారితోపాటు మరో ముగ్గురికి గాయాలు
-డ్రైవర్ నిద్రలోకి జారుకోవడంతో ఘటన
-శోకసంద్రంలో కందుకూరు



నుజ్జు నుజ్జయిన కారు


ప్రజాశక్తి - కందుకూరు

కారు డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి నిద్ర మత్తులోకి జారుకోవడంతో ముగ్గురి ప్రాణాలను గాల్లో కలిశాయి. చిన్నారి తో పాటు మరో ఇద్దరు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. పెళ్లి బృందం ఆనందం కొన్ని గంటల వ్యవధిలోనే ఆవిరి అయ్యింది. మరో అరగంట వ్యవధిలోనే గమ్యం చేరుతామనగా కారు డ్రైవర్ నిద్ర మత్తు ముగ్గురు ప్రాణాలు గాల్లో కలిశాయి. దీంతో పెళ్లి కుమార్తె కుటుంబంతో పాటు కందుకూరు ప్రాంతమంతా శోకసంద్రంలో మునిగింది. ఈ ఘోర రోడ్డు ప్రమాదం ఆనందంగా గడపాల్సిన పెళ్లి కుటుంబంలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

కందుకూరు పట్టణం గుర్రంవారిపాలెం కు చెందిన రాయని అరుణ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులందరితో కలిసి కుమార్తె వివాహం నిమిత్తం తెలంగాణ రాష్ట్రం, పాల్వంచ వెళ్లారు. బుధవారం రాత్రి భద్రాచలంలో వివాహం జరిగింది. పెళ్లి కుమార్తె తల్లి రాయని అరుణ తోపాటు కుటుంబ సభ్యులందరూ పెళ్లి వేడుకలో పాల్గొన్నారు. అనంతరం పెళ్లి వారు అంతా వెనుక బస్సులో వస్తుండగా పెళ్లి కుమార్తె తల్లి రాయని అరుణ కందుకూరులో ఇంటి వద్ద పెళ్లి పనులు చూసుకునే నిమిత్తం కుమారుడు, బంధువులతో కలిసి బుధవారం అర్ధరాత్రి సమయంలో టిఎస్ 08 హెచ్‌యు 1567 నెంబరు గల కారులో కందుకూరు కు తిరుగు పయనమయ్యారు. టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెం జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి కారు డ్రైవింగ్ చేస్తున్న తల్లపనేని వినోద్ నిద్రమత్తులోకి జారుకున్నాడు. కారు అదుపుతప్పి ఫ్లైఓవర్ బ్రిడ్జి డివైడర్ ను ఢీ కొని కిందకు పల్టీ కొట్టిన కారు జాతీయ రహదారి ఫెన్సింగ్ వైపు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో పెళ్లి కుమార్తె తల్లి రాయని అరుణ (50) కుటుంబ సభ్యులు తల్లపనేని దివ్య (28) గుళ్ళాపల్లి శ్రావణి (22) అక్కడికక్కడే మతి చెందారు. పెళ్లి కుమార్తె సోదరుడు రాయని వేణు, డ్రైవర్ తల్లపనేని వినోద్ లతో పాటు వినోద్ కుమారుడు అభిలాష్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎన్ హెచ్16 జాతీయ రహదారి పెట్రోలింగ్ సిబ్బందితో పాటు శింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్, టంగుటూరు ఎస్క్మి ఎ నాగేశ్వరరావు, పోలీస్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్ కు తరలించారు. గాయపడిన వారికి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స చేస్తున్నారు.

నిద్ర మత్తే ప్రమాదానికి కారణం.. సిఐ

కారు డ్రైవింగ్ చేస్తున్న తల్లపనేని వినోద్ నిద్రమత్తు వల్లే ఈ రోడ్డు ప్రమాదం జరిగిందని సింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్ స్పష్టం చేశారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం వద్దకు కారు వచ్చిన సమయంలో కారు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్నట్లు పోలీసులు అంచనా వేశారు. వినోద్ నిద్రమత్తులో డ్రైవింగ్ చేస్తుండడంతో కారు అదుపుతప్పి ఫ్లై ఓవర్ బ్రిడ్జి డివైడర్ కు ఢీ కొనడంతో ఇంత ఘోర ప్రమాదం జరిగినట్లు తెలిపారు. కారు ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రంగనాథ్ పేర్కొన్నారు.



దివ్య, శ్రావణి ల మతదేహాలను అంబులెన్స్ లోకి తరలిస్తున్న హైవే సిబ్బంది.

రోడ్డు ప్రమాదంపై 'ఇంటూరి' దిగ్భ్రాంతి

గురువారం సూరారెడ్డిపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కందుకూరు పట్టణం గుర్రంవారిపాలెం ప్రాంతానికి చెందిన ముగ్గురు చనిపోవడం దిగ్భ్రాంతికి గురిచేసింది అని టిడిపి కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మృతిచెందిన రాయని అరుణ, తల్లపనేని దివ్య, గుళ్లాపల్లి శ్రావణిల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రాయని వేణు, తలపనేని వినోద్ మరియు చిన్నారి కూడా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సిఐ రంగనాథ్

హత్య కేసులో నిందితుడు అరెస్టు

అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త

ప్రజాశక్తి-కందుకూరు : భార్యను హత్య చేసిన భర్త చిమటా శివకృష్ణను కందుకూరు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో సిఐ నఫీజ్ బాషా హత్య వివరాలను వివరించారు. చిమటా వనజాక్షి(22) పై అనుమానంతో భర్త శివకృష్ణ ఈనెల 25వ తేదీ హత్య చేవాడు. 2014 సంవత్సరంలో వలేటివారిపాలెం మండలం పోకూరు గ్రామానికి చెందిన శివకృష్ణతో శ్రీకాకుళం జిల్లాకి చెందిన వనజాక్షికి వివాహం జరిగింది.వారికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కందుకూరు గాయత్రి నగర్‌లో అద్దెకు ఇల్లుతీసుకుని కాపురం ఉంటూ శివకృష్ణ ట్రాక్టర్ పనిచేస్తూ ఉంటాడు. హత్యకు గురైన వనజాక్షి గత నాలుగేళ్లుగా బ్యూటీ పార్లర్ పని నేర్చుకొని ఇంటి వద్దనే బ్యూటీ పార్లర్ వర్క్ చేస్తూ ఉంటుంది. శివకృష్ణ తన భార్య అయిన వనజాక్షిపై అనుమానంతో తరచూ గొడవ పడుతుండేవాడు. ఈ మధ్యకాలంలో మృతురాలిపై శివకృష్ణకు అనుమానం మరింత పెరిగింది. ఈ క్రమంలో ఈ నెల 25వ తేదీ ఉదయం పిల్లలను తీసుకొని వనజాక్షి వాళ్ళ అమ్మ ఇంటి వద్ద వదిలిపెట్టి కేసరగుంట కాలనీలో బ్యూటీ పార్లర్ పని చూసుకొని తిరిగి మధ్యాహ్నం 12 గంటలకు ఇంటికి వచ్చింది. 12:30 గంటల సమయంలో వాషింగ్ మిషన్ లో ఉన్న ఉతికిన బట్టలను ఆరవేసే క్రమంలో మృతురాలు అయినా వనజాక్షి శివకృష్ణ గొడవ పెట్టుకున్నారు. శివకృష్ణ వనజాక్షిని కొడుతూ నిన్ను చంపుతానని అంటుండగా ఇంతలో మృతురాలి తల్లిదండ్రులు అయినా నంబాల ఎర్రమ్మ ,నాగేశ్వరరావు వచ్చి సర్ది చెప్పి వెళ్లిపోయారు. మళ్లీ భార్యాభర్తలిద్దరూ గొడవ పెట్టుకోగా ట్రాక్టర్ డోర్ కు ఉండే రాడ్డు తీసుకొని వనజాక్షి తలపై అనేకసార్లు బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. సాయంత్రం 6 గంటలకు సమయంలో ఫోన్ చేయగా ఆమె తీయకపోవడంతో ఏం జరిగిందోనని ఇంటికి వెళ్లి చూడగా రక్తపు మడుగులో పడి ఉంది. దీంతో వనజాక్షి తల్లి ఎర్రమ్మ తండ్రి నాగేశ్వరరావు పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కందుకూరు డిఎస్పి ఎస్ శ్రీనివాస్ పర్యవేక్షణలో కందుకూరు సిఐ నఫీజ్ భాష, కందుకూరు పట్టణ ఎస్ఐ ఆనంద్ భాస్కర్ వారి సిబ్బంది సహకారంతో గురువారం నిందితుడు శివకృష్ణను అరెస్టు చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహించే

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఒక్క పూట బడులు నిర్వహించకుండా వ్యవహరిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి ఎస్ఎఫ్ఐ నగర కమిటీ నాయకులు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మార్చి 18వ తేది నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఒంటిపూట బడులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. జిల్లాలో కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ఆ నిబంధనలకు వ్యతిరేకంగా తమ పాఠశాలల్లో తరగతుల యధావిధిగా రెండు పూటలా నిర్వహిస్తున్నారన్నారు. తాము పాఠశాలలకు వ్లై రెండు పూటల తరగతుల నిర్వహణను అడ్డుకున్నామన్నారు. సంబంధిత విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి నిబంధనలకు విరుద్ధంగా రోజు మొత్తం తరగతులు నిర్వహిస్తున్న ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో తాము జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని నగర కార్యదర్శి డి .చరణ్ నగర కమిటీ సభ్యులు విష్ణు శివాజీ పేర్కొన్నారు.






రంగారావు భౌతికకాయానికి నివాళి అర్పిస్తున్న 'బుర్రా'

రంగారావుకు నివాళి

ప్రజాశక్తి-కందుకూరు : మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు, వాసవి నగర్ ప్రెసిడెంట్ విడుపులపాటి రంగారావు మృతి వైసిపికి తీరని లోటని వైసిపి అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు.పట్టణ ప్రముఖులు ఆర్యవైశ్య సీనియర్ నాయకులు రంగారావు అనారోగ్యం కారణంగా చికిత్స పొం దుతూ గురువారం మృతిచెందారు. స్థానిక వాసవి నగర్‌లో రంగారావు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం



ప్రజాశక్తి -ఉలవపాడు

కందుకూరు నియోజకవర్గం వైసిపి అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ గురువారం మండలంలోని పెద్ద పట్టపు పాలెం, చాగిచర్ల, రామాయపట్నం, వీరేపల్లి ,గ్రామంలో ఎన్నికల ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో వైసీపీ నాయకులు కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తమ అమూల్యమైన ఓటునువేసి తనకు,నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేయుచున్న విజయసాయిరెడ్డినిగెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలోమండల వైసిపి అధ్యక్షుడు నన్నం పోతురాజు, జే.సి.ఎస్ కన్వీనరు వెలిచెర్ల ధనకోటి, మండల వైస్ ఎంపీపీ సయ్యద్ పజులు, పెద్ద పట్టపాలెం గ్రామ సర్పంచ్ ఆవులు జయరావ్ , ఎంపీటీసీ కాటం అరుణ, రాష్ట్ర విద్యాది విభాగం సభ్యులు గోసుల రాజశేఖర్ రెడ్డి, కోటు కోటయ్య, వెలిచెర్ల చంద్రశేఖర్, చాగిచర్ల గ్రామ సర్పంచ్ ఎలమల్లు విజయమ్మ, చాగిజర్ల ఎంపీటీసీ సభ్యులు సన్నిబోయిన మాధవ, సొసైటీ ప్రెసిడెంట్ గంటా శ్రీనివాసులు, చాకిచెర్ల వైసీపీ నాయకులు నల్లపురెడ్డి మధుసూదన్ రెడ్డి, అమ్మనబ్రోలు బ్రహ్మయ్య, వేమ రెడ్డికష్టారెడ్డి వీర రాఘవరెడ్డి, కోటు కోటిలింగం ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి

ప్రజాశక్తి-ఆత్మ కూరు అర్బన్: ఆత్మకూరు నియోజకవర్గానికి ఎనలేని కృషిచేస్తానని మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూరులో జరిగిన మూడు పార్టీల జాయింట్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనం రామ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఎపిలో వైసీపీ అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల సమయంలోనే అమరావతి లోని ప్రజాపాలన ప్రగతి భవనం మొట్టమొదటిగా కూల్చి వేశారన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు అభివృద్ధి అనేది లేక రాష్ట్రం కుంటుపడిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ను విధ్వంసకాండగా మార్చరని వైసీపీ పాలనలో సామాన్య ప్రజలకు సైతం రక్షణ కొరవడిందని ఆవేదన వ్యక్తం చేశారు . ప్రభుత్వ తీరుపై ఎదిరించిన వారిపై అక్రమ కేసులు బనాయించిందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గం పదేళ్లుగా మేకపాటి ఆధీనంలో ఉన్నప్పటికీ ఆత్మకూరుకు చేసిన అభివృద్ధి ఏంటో తెలపాలన్నారు. మండల కేంద్రమైన సంగం కొండను తవ్వేశారని, గ్రామ ప్రకతి వైపరీత్యాల నుండి రక్షణగా ఉన్న కొండను మాయం చేశారంటే వీరి పాలన ఎలా ఉందో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం వద్ద నిధులు లేక నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే భూ సేకరణ పనులు నిలిచిపోయాయని గుర్తు చేశారు. టిడిపి అధికారంలోకి రాగానే రైల్వే పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు . రానున్న సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్ర ప్రజలు అభివృద్ధి చేసే టిడిపికి పట్టం కట్టాలని కోరారు. మరో మారు వైసీపీకి ఓటు వేస్తే అరాచకానికి ఓటు వేసినట్లేనని తెలియజేశారు. అనంతరం టిడిపి పోస్టర్లను టిడిపి నాయకులతో కలిసి ఆవిష్కరిం చారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు బుల్లెట్ రమణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బావా పెంచలరావు , టిడిపి పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి , కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, చల్లా రవికుమార్ రెడ్డి పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు , చిట్టుమూరు వెంకటేశ్వర్ రెడ్డి, కేశవ చౌదరి, మంజుల నాయుడు, వెంకటరమణమ్మ, మీరా మొహిద్దిన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆనం

రెండు లారీలు ఢీ ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి-వరికుంటపాడు: ఆగి ఉన్న లారీని వేగంగా వెళుతున్న మినీ వ్యాను కునుకు తీయడంతో ఢీకొన్న సంఘటనతో ఇద్దరు దుర్మరణం చెందారు. ఈసంఘటన మండలంలోని తిమ్మారెడ్డిపల్లి జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక నుంచి రాగుల లోడుతో గుంటూరుకు వెళుతూ తిమ్మారెడ్డిపల్లి గ్రామం వద్ద డ్రైవర్ లారీని ఆపి టైర్లకు గాలి చెక్ చేస్తున్నాడు. దుత్తలూరు నుంచి పామూరు వైపుగా అతివేగంగా వస్తున్న మినీ వ్యాన్ పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆగి ఉన్న లారీ డ్రైవర్ బత్తల సుబ్బరాయుడు(60) అక్కడికక్కడే మతి చెందగా ఢీ కొట్టిన వాన్ డ్రైవర్ ప్రతాప్ సింగ్(44) మినీ లారీ లోనే ఇరుక్కొని పోయి దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న ఉదయగిరి సిఐ గిరిబాబు, ఎస్ఐ తిరుపతయ్య తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. జరిగిన తీరును తెలుసుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపతయ్య తెలిపారు.



అభివృద్ధి పథంలో సొసైటీ

ప్రజాశక్తి-కోవూరు: స్థానిక శాంతినగర్‌లోని పడుగుపాడు సహకార సొసైటీ రైతులు, ఖాతాదారులు సహకార శాఖ అధికారుల సలహాలు, సూచనలతో అభివృద్ధి పథంలో పయనిస్తుందని సొసైటీ చైర్మన్. ఆర్. మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. సహకార సొసైటీ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సొసైటీ 1921 సంవత్సరంలో రిజిస్టర్ అయిందన్నారు. ప్రస్తుతం, సొసైటీ 16,760 సభ్యులు, 1793 మంది క్రియాశీలక సభ్యులతో బలోపేతంగా ఉందన్నారు. 2023న24 ఆర్థిక సంవత్స రానికి సంబంధించి ఇప్పటివరకు 718 మంది రైతులకు 22 కోట్ల మేర రుణాలు అందించడం జరిగిందన్నారు. అదే విధంగా ఎన్టీవో కింద 460 మంది రైతులకు రూ.15కోట్లు, గృహ రుణాల కింద ఇప్పటివరకు 8 మంది 100లక్షల మేర రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. సహకార శాఖలో ఏర్పాటు చేసిన బ్యాంకులో 225 మంది ఖాతాదారులకు బంగారుపై రుణాలు అందించామన్నారు. ప్రస్తుతం తమ బ్యాంకులో లాకర్ సదుపాయం కూడా ఏర్పాటు చేసిన ఉందని, దీనిని ఖాతాదారులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇటువంటి మంచి అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలన్నారు. త్వరలో ఇనమడుగు గ్రామంలోని సొసైటీ స్థలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు కూడా సిద్ధం చేశామని, త్వరలో ఈ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో, సొసైటీ డైరెక్టర్లు ఏ. ప్రసాద్, జి. జనార్దన్, సొసైటీ సిఇఒ గోవర్దన్‌రెడ్డి, తరతరులు పాల్గొన్నారు.

తాగు, సాగునీరందిస్తాం

ప్రజాశక్తి-సీతారామపురం: ఉదయగిరి నియోజకవర్గంలోని ప్రతి ఊరికి తాగు,సాగు నీరందిస్తామని రాజ్యసభ సభ్యుడు నెల్లూరు ఎంపి అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డి లు పేర్కొన్నారు. బుధవారం సీతారామపురంలో ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన విజయ సంకల్ప యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాజీ జెడ్‌పిటిసి దుగ్గిరెడ్డి గురవా రెడ్డి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పిసి అల్లూరు రాజుల ఆధ్వర్యంలో మండలంలోని అన్ని పంచాయతీల నుంచి వైసిపి కార్యకర్తలు అభిమానులు వేలాది మంది పాల్గొని వారికి స్వాగతం పలికారు. ఎల్‌విఆర్ జూనియర్ కళాశాల నుండి ర్యాలీగా వచ్చి బస్టాండ్ సెంటర్ వద్ద భారీ బహిరంగ సభ జరిగింది. ఈ సభలో అభ్యర్థులు మాట్లాడుతూ ఉదయగిరి ప్రాంతానికి వెలిగొండ, సీతారామసాగర్ ప్రాజెక్టులను పూర్తి చేయించి, సోమశిల నుండి నీటిని ఉదయగిరి ప్రాంతానికి తీసుకొచ్చి తాగు సాగునీటి ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని ప్రతి చెరువుకు సరిపడా నీళ్లను ఆర్నెల్లకోసారి అందించి రైతాంగాన్ని ప్రజలను పూర్తిగా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి, మాజీ జెడ్పిటిసి దుగ్గిరెడ్డి గురవారెడ్డి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పిసి అల్లూరు రాజు, తదితర నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

కోవూరు సర్పంచ్ టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-కోవూరు: కోవూరు సర్పంచ్ యాకసిరి విజయమ్మ ఏడో వార్డ్ మెంబర్ గిరి పద్మ, 12వ వార్డు మెంబర్ కృష్ణవేణి, 9వ వార్డు మెంబర్ ఇంతా విజయ, వీరంతా గాదిరాజ్ అశోక్ సమక్షంలో టిడిపి కండువా కప్పుకున్నారు. దీంతో వైసిపికి కోవూరులో గట్టి దెబ్బ తగిలిందని ప్రజాభిప్రాయం.

రక్తదానం గొప్పది

ప్రజాశక్తి-కోవూరు: రక్తదానం చేయడం అనేది మరొకరికి ప్రాణదానంతో సమానమని పడుగుపాడు సహకార పరపతి సంఘం చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో శాంతినగర్‌లోని సొసైటీ ప్రాంగణంలో గురువారం మహాజన సభ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో రక్తదానం చేస్తే బలహీనపడిపోతామనే ఆపోహ అది సరికాదన్నారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి యువకుడు స్వచ్ఛందంగా రక్తదానం చేయొచ్చని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు సకాలంలో రక్తం అందక అనేకమంది ప్రాణాలు పోయే పరిస్థితి ఉండేదన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సొసైటీ సిఇఒ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ రక్తదానం శిబిరంలో సొసైటీ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు మీడియా మిత్రులు ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుడు గునుపాటి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఈ వేసవి సమయంలో రక్తం ఆవశ్యకత ఎంతైనా 20. పడుగుపాడు సహకార సొసైటీ ముందుకు వచ్చి రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో మోటివేటర్ భాస్కర్ తదితరులున్నారు.కార్యక్రమంలో సొసైటీ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.



కర్తదానం చేస్తున్న దృశ్యం

ఎన్నికల శిక్షణకు గైర్హాజరైతే చర్యలు


ఆత్మకూరులో కలెక్టర్ పరిశీలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలకు గైర్హాజరైతే చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ పేర్కొన్నారు. గురువారం ఆత్మకూరు, అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను కలెక్టర్ పర్యవేక్షించారు. అనంతరం ఆత్మకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 13న ఎన్నికల పోలింగ్ జరగనున్న దృష్ట్యా, ఎటువంటి పొరపాట్లు లేకుండా పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాలో రెండు విడతల్లో సుమారు 16 వేలమంది పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా మొదటి విడత శిక్షణ కార్యక్రమం రిటర్నింగ్ అధికారుల సమక్షంలో పూర్తి చేసినట్లు చెప్పారు. పోలింగ్ అధికారులు అందరూ ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని సందేహాలను ముందుగానే నివృత్తి చేసుకోవాలని, ఎటువంటి పొరపాట్లు లేకుండా పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు సంసిద్ధం కావాలని సూచించారు. ఎన్నికల శిక్షణకు గైర్హాజరైన పోలింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటామని, నూటికి నూరు శాతం సిబ్బంది శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యే విధంగా రిటర్నింగ్ అధికారులు బాధ్యత తీసుకోవాలని ఆర్వోలను ఆదేశించారు. శిక్షణకు హాజరవుతున్న పోలింగ్ అధికారులకు, సిబ్బందికి మంచి భోజనం అందించాలని, ఎక్కడా రాజీ పడకుండా నాణ్యత ప్రమాణాలతో కూడిన అల్పాహారం, భోజనం ఏర్పాటు చేయాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఆత్మకూరు, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు , కె. మధులత, ఆర్వోలు తదితరులున్నారు.


కోవూరులో పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి–కోవూరు

మే 13న ఎన్నికల పోలింగ్ జరగనున్న దృష్ట్యా, ఎటువంటి పొరపాట్లు లేకుండా పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ చెప్పారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెండు విడతల్లో సుమారు 16 వేలమంది పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా మొదటి విడత శిక్షణ కార్యక్రమం రిటర్నింగ్ అధికారుల సమక్షంలో పూర్తి చేసినట్లు చెప్పారు. పోలింగ్ అధికారులు అందరూ ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని సందేహాలను ముందుగానే నివృత్తి చేసుకోవాలని, ఎటువంటి పొరపాట్లు లేకుండా పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు సంసిద్ధం కావాలని సూచించారు. ఎన్నికల శిక్షణకు గైర్హాజరైన పోలింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటామని, నూటికి నూరు శాతం సిబ్బంది శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యే విధంగా రిటర్నింగ్ అధికారులు బాధ్యత తీసుకోవాలని ఆర్వోలను ఆదేశించారు. శిక్షణకు హాజరవుతున్న పోలింగ్ అధికారులకు, సిబ్బందికి మంచి భోజనం అందించాలని, ఎక్కడా రాజీ పడకుండా నాణ్యత ప్రమాణాలతో కూడిన అల్పాహారం, భోజనం ఏర్పాటు చేయాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఉదయగిరి, ఆత్మకూరు, కోవూరు అసెంబ్లీ నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు ప్రేమ్ కుమార్, మధులత, సేతు మాధవన్, ఇఆర్ఒలు నెహ్రూ బాబు, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రూ.300

ప్రజాశక్తి-ఉదయగిరి

ఉపాధి హామీ కూలీలకు రోజువారి మొత్తం 300 రూపాయలు చెల్లించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని డ్వామా ఎపిడి గాయత్రి దేవి పేర్కొన్నారు. గురువారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బందితో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఇంతవరకు చేపడుతున్న ఉపాధి కూలీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం తీయటి కబురు అందించిందన్నారు. ఈ విధానం ఏప్రిల్ మొదటి వారం నుంచి అమలవుతుందని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2023–24లో ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.272 అమలు చేస్తున్నారని,దీనికి అదనంగా మరో 28 రూపాయలు జోడించి ఏప్రిల్ నుంచి మొదలయ్యే కొత్త ఆర్థిక సంవత్సరంలో దినసరి వేతనం 300చెల్లిస్తారన్నారు. 2024–25 సంవత్సరంలో దినసరి 300 రూపాయలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ఆమోదం పొందిందని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ శ్రీనివాసులు, ఇసి మురళి, టిఎలు, ఎఫ్ఎలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డ్వామా ఎపిడి గాయత్రి దేవి


ఆర్ఎస్ఆర్‌లో టెక్నోఫల్స్ 2కె24 వన్డే సింపోజియం

ప్రజాశక్తి-బిట్రగుంట: బోగోలు మండలం, కడనూతల గ్రామంలో గల రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం "టెక్నోఫల్స్ 2కె 24 వన్డే సింపోజియం" పేరుతో టెక్నికల్ ప్రోగ్రాం జాతీయస్థాయిలో జరిగినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పివిఎన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, ప్రాజెక్టు ఎక్స్ పో వంటి టెక్నికల్ కార్యక్రమాలను జాతీయస్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి 600కు పైగా పార్టిసిపెంట్స్ అప్లై చేశారు. అందులో మెరిట్ పేపర్స్ సమాజానికి ఉపయోగపడే పేపర్లను 249 సెలెక్ట్ చేసి వారిచే ప్రజెంటేషన్ ఇప్పించడం జరిగిందని. ప్రజెంటేషన్ డిపార్ట్మెంట్ వైజ్ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ సిఎస్ఇ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ ఈసీఈ, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ ఈ,ఈ,ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ ఏ ఐ ,డిఎస్ విభాగాలలో సపరేటుగా నిర్వహించి వారిలో మెరిట్ కనపరచిన మొదటి మూడు పేపర్లను సెలెక్ట్ చేసి ప్రథమ, ద్వితీయ, తతీయ ప్లేస్ లకు ఎంపిక చేసి వారికి నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాన్ని అన్ని విభాగాలకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమం వల్ల విద్యార్థిని, విద్యార్థులలో దాగి ఉన్న సజనాత్మకత, షార్ప్ నెస్, విశ్లేషణ వంటి గుణాలను వెలికితీసేందుకు ఎంతగానో దోహదపడుతుందని తెలి పారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆర్వీ రమణారెడ్డి, కన్వీనర్ డాక్టర్ ఎన్.కృష్ణచైతన్య, ఆర్గనైజింగ్ కమిటీ మెంబర్లు వి. సునీల్ రెడ్డి, పివి రామకుమార్, ప్రసాద్ రెడ్డి, కే.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-కోవూరు: త్వరలో జరగనున్న ఎన్నికల్లో పార్లమెంట్ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కోవూరు అసెంబ్లీ అభ్యర్థిగా తనను ప్రజలు ఆదరించి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అవినీతి లేని అభివృద్ధి చేపట్టి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని కోవూరు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలోని మోడేగుంట గ్రామంలో గురువారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో చిన్న గ్రామమైన ఈ మోడేగుంటలో గిరిజన కాలనీలో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. వీటిపై ఇప్పటివరకు ఎవరు కూడా ఆశించిన మేర దృష్టి సారించిన దాఖలాలు లేవన్నారు. అదేవిధంగా రైతుల సంక్షేమాన్ని కూడా ఈ ప్రభుత్వం ఆశించిన మేర చొరవ చూపిన దాఖలాలు లేవన్నారు. పోలంరెడ్డి దినేష్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నియోజకవర్గానికి ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీలో కూడా మహిళా అభ్యర్థికి టికెట్ ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఇప్పటికే ఆ దంపతులు రాజకీయాలతో సంబంధం లేకుండా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టారన్నారు. అధికారం లేనప్పుడే ఇన్ని పనులు చేసిన వారు అధికారం తోడైతే ఎంత అభివృద్ధి చేస్తారో ప్రజలు ఒకసారి ఆలోచించు కోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు యద్దలపూడి నాగరాజు, జీవి నాగరాజు, దాసరి మురళి, తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో లేగుంటపాడు సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి, వేమిరెడ్డి అర్జున్‌రెడ్డి, సీనియర్ నేతలు సీహెచ్ పెంచలయ్య, సీహెచ్ చిన్నయ్య. డి. విజయ్ బాబు, సుబ్బానాయుడు, సనత్‌రెడ్డి, శ్రీఖర్‌రెడ్డి, పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న ప్రశాంతిరెడ్డి


విజయసాయిరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

విజయసాయిరెడ్డిని కలిసిన 'కల్లూరి'

ప్రజాశక్తి-ఉదయగిరి: వైసిపి ఎంపి అభ్యర్థి విజయసాయిరెడ్డిని ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ యువజన ప్రధాన కార్యదర్శి కల్లూరి రాజారెడ్డి కలిసి శాలు వాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఉదయగిరి రాజకీయం పై కొంత సమయం పాటు చర్చించారు.

సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కావలి: తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కావలి పట్టణ oలో శుక్రవారం నిర్వహించే ప్రజాగళం సభను జయప్రదం చేయాలని కావలి టీడీపీ – జన సేన – బీజేపీ ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి కోరారు. గురువారం కావలి టీడీపీ కార్యాల యంలో క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ కావలి పట్టణ oలోని ఏఎం బేకరీ సెంటర్ వద్ద మధ్యాహ్నం 3 గంటలకు ప్రజాగళం సభ నిర్వహిస్తున్నామని, ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను చంద్రబాబుకి అందజేయవచ్చని తెలిపారు.

ట్రైనింగ్‌కు హాజరు కావాలి

ప్రజాశక్తి-ఉదయగిరి: ఎన్నికల శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్, ఎన్నికల అధికారి హరి నారాయణన్ ఆకస్మిక తనిఖీ చేశా రు. గురువారం ఉదయగిరి లోని మేకపాటి గౌత మ్ రెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు ఇస్తున్న ఎన్నికల శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్, ఎన్నికల అధికారి హరి నారాయణన్ తనిఖీలు చేసి ట్రైనింగ్‌కు హాజరు కాని వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్ఒ, ఎపి ఆర్ఒలను ఆదేశించారు. జరిగే సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహరించాలన్నారు. కార్యక్రమంలో నియోజవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజా రమేష్, ప్రేమ్ కుమార్, సహాయక రిటర్నింగ్ అధికారి నెహ్రూ బాబు పాల్గొన్నారు.

683పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు: మండలంలోని డిసి పల్లి పొగాకు వేలం కేంద్రానికి పలు గ్రామాలకు చెందిన రైతులు 844పొగాకు బేళ్లను వేలం కేంద్రానికి తీసుకొచ్చారు. వీటిలో 683పొగాకు బేళ్లను పలు కంపెనీలకు చెందిన వ్యాపా రస్తులు కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 140 పొగాకు బేళ్లను తిరస్కరిం చారు.వీటిలో ఎన్ఎస్ 41ఎన్ బి86సీఆర్ 13ఉన్నాయి.అధిక బరువుతో ఉన్న21పొగాకు బేళ్లను వేలానికి తిరస్కరించారు.కిలో పొగాకు గరిష్టధర 230కాగా కనిష్ట ధర 220రూపాయల, సగటు ధర228. 19నమోదు కాగా , వేలం లో 16మంది కంపెనీ వ్యాపా రస్తులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

సోమరాజుపల్లి అభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

సోమరాజుపల్లి గ్రామ అభివృద్ధిలో దేవిరెడ్డి కుటుంబీకుల పాత్ర కీలకమని టిడిపి నాయకులు దేవిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మొత్తలు గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ తండ్రి హయాం నుంచి సోమరాజుపల్లి అభివృద్దే ధ్యేయంగా తమ కుటుంబం పనిచేస్తుందన్నారు. సోమరాజుపల్లిలో రోడ్లు మొదలు శ్మశాన వాటికల కాంపౌండ్ వాల్ వరకు పూర్తి చేసిన ఘనత తమకు దక్కుతుం దన్నారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి చెంచుకిషోర్ బాబు, పల్లికొండ లక్ష్మణరావు, గంపల అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మర తనిఖీలు

ప్రజాశక్తి-మర్రిపాడు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నెల్లూరు – కడప సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు.పొట్టేళ్ల లోడుతో వెళ్తున్న అశోక్ లైలాండ్ ట్రక్ ను పోలీసులు తనిఖీ చేశారు. వాహనంలోని నాగరాజు అనే వ్యక్తి వద్ద ఎటువంటి బిల్లులు లేకుండా ఉన్న రూ 2.20 లక్షలవేల నగదును ఎస్ఐ విశ్వనాథ్ రెడ్డి స్వాధీనం చేసుకున్నారు.నగదుతో పట్టుబడ్డ వ్యక్తి ప్రకాశం జిల్లా, అగ్రహారం గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-కావలి

బ్రాహ్మణ మహా సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ వి.కె.శీనా నాయక్‌ను కలిసి కాకినాడలో శివాలయం అర్చకులపై జరిగిన దాడిని ఖండిస్తూ, అందుకు కారకు లై న వారిపై చట్టరీత్యా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. పీవీఎస్ ప్రసాద్ బ్రాహ్మణ మహా సంఘం అధ్యక్షులు ఆధ్వర్యంలో ఏవి రమణమూర్తి ప్రధాన కార్యదర్శి నిర్వహణలో ఈ కార్యక్రమం జరిగింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, అంతే కాకుండా దీనికోసం ఒక చట్టాన్ని తేవాలని ప్రభుత్వానికి మనవి చేస్తున్నామని తెలిపారు.కార్యక్రమానికి సంఘ కోశాధికారి టీవీఎంఎన్ ప్రకాష్ అసోసియేట్ ప్రెసిడెంట్ ఎన్. మధుసూదన్ రావు, గౌరవాధ్యక్షులు నందనవనం శ్రీహరి రావు ప్రాంతీయ కార్యదర్శులు టి.రమేష్, జి.మారుతీ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం, ముంగమూరు రోడ్డు జాతీయ రహదారి పక్కన ఉన్న భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణకేంద్రంలో కావలి రూరల్ మండలం పెదనట్టు గ్రామం పెనుఏలు ప్రార్థనా మందిరం తరపున వాయిల ఇస్రాయేలు కుటుంబం దుప్పట్లు ,భోజనం, పండ్లు ,స్వీట్ లు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రవి కిరణ్, ఆదరణకేంద్రం డైరెక్టర్ సింహాద్రి భవాని, వెంకటక్రిష్ణ, శైలజ, జ్యోతి, మనోజ్ పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీలు వితరణ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

పట్టణం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థి కాటం రెడ్డి రవీంద్రా రెడ్డి పాఠశాలకు రూ.25వేలు విలువ చేసే సిమెంట్ బెంచీలను వితరణ చేశారు. పాఠశాల కమిటీ చైర్మెన్ వంటేరు మల్లి కార్జున అభ్యర్థన మేరకు బెస్ట్ మిత్రుల వెల్ఫేర్ ట్రస్ట్ తరఫున బెంచీలను వితరణ చేసి వారి దాతృత్వాన్ని చాటుకున్నారు. అంతే కాకుండా పాఠశాలకు ఏమి కావాలన్న ఎల్లప్పుడూ సహాయ సహకారాలు ఉంటాయని తెలియజేశారు. వారి ట్రస్ట్ చైర్మన్ సభ్యులను పాఠశాల కమిటీ చైర్మెన్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయిని అనంత లక్ష్మీ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఇలాంటి పూర్వ విద్యార్థులను అందరూ స్ఫూర్తిగా తీసుకొని పాఠశాల అభివృద్ధికి సహకరించాలని పాఠశాల కమిటీ చైర్మెన్ కోరారు.


బెంచీలు అందజేస్తున్న దృశ్యం

సర్వేయర్ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-అనంతసాగరం: ఇటీవల విద్యుత్ షాక్‌తో గురై మృతి చెందిన సచివాలయ సర్వేయర్ విష్ణువర్ధన్ కుటుంబసభ్యులను గురువారం ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి పరామర్శిం చారు. మండలంలోని లక్కరాజుపల్లి గ్రామంలోని సర్వేయర్ విష్ణువర్ధన్ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే మేకపాటి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారని, 10 రోజుల క్రితమే వివాహం జరిగిన విషయాన్ని తెలుసుకుని సంతాపం వ్యక్తం చేశారు. ప్రభుత్వపరంగా వారి కుటుంబానికి రావాల్సిన ఆర్థిక సహాయం అందేలా చూస్తామని వారి కుటుంబానికి భరోసా కల్పించారు.

బ్రహ్మోత్సవాల హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-బిట్రగుంట: బోగోలు మండలం, కొండ బిట్రగుంట గ్రామంలో వెలిసిన ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో 2024 బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు కానుకలుగా ఇచ్చిన మొత్తం16,39,801 నగదు వచ్చినట్లు కార్య నిర్వహణ అధికారి అరవ రాధా కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఇఒ కార్యనిర వ్యహ ణాధికారి రాధాకృష్ణ, యానాదయ్య, కృష్ణ ప్రసాద్, పి.శ్రీనివాసులు, గ్రామస్తులు రచూరి పాపయ్య, ఒట్టూరు మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-బిట్రగుంట: కావలి శాసనసభ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పి ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పసుపులేటి సుధాకర్ ప్రచారాన్ని కార్యకర్తలు ,పిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహ కుడు పసుపులేటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బోగోలులో ఇంటింటి ప్రచారాన్ని గురువారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా పసుపులేటి వెంకటే శ్వర్లు మాట్లాడారు. కార్యక్రమంలో ఆంథోని, కృష్ణ,పేట శ్రీధర్, ప్రత్యూష, తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథరావుపేటలో ప్రచారం

ప్రజాశక్తి-బిట్రగుంట :బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీలో గురువారం ఉమ్మడి తెలుగుదేశం పార్టీ, బిజెపి, జనసేన పార్టీ లు కలిసి విస్తత ప్రచారాన్ని టిడిపి మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వం ׳రావు . బిజెపి కన్వీనర్ నూకసాని శ్రీని వాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టిడిపి మేనిఫెస్టో కరపత్రాలను పంచారు. కార్యక్రమంలో సుధీర్ బాబు, అహ్మద్ బాషా, బాలు, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

శివలింగం ప్రతిష్ఠ

ప్రజాశక్తి-గుడ్లూరు : గుడ్లూరు లో ఉన్న పురాతన నీలకంఠేశ్వర స్వామి దేవాలయంలో శివలింగాన్ని ప్రతిష్ఠించేందుకు గురువారం శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా ముఖ్య అతిథిగా కందుకూరు నియోజకవర్గ వైసిపి అభ్యర్థి బుర్ర మధుసూదన్ యదవ్ పాల్గొన్నారు. ఎంఎల్‌ఎ మానుగుంట మహీందర్ రెడ్డి సహకారంతో దేవాలయాన్ని ఆధునికరించి నిర్మిస్తున్నారు.

1 నుంచి ఉచిత కోచింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో పాలీ సెట్ 2024 ప్రవేశ పరీక్ష కోసం వచ్చే నెల 1నుంచి ఉచిత కోచింగ్ తరగతులు ప్రారంభం కానున్నాయని ప్రిన్సిపాల్ కె చస్తానయ్య తెలిపారు. అర్హతగలిగిన విద్యార్థులకు పాలిసెట్ ఉచిత శిక్షణ అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగం చుకొని పాలిసెట్‌లో ఉన్నత ర్యాంకును సాధించేందుకు కృషి చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ కె మస్తానయ్య సూచించారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కందుకూరు కళాశాల నందు సంప్రదించాలన్నారు.

ఎన్నికల ప్రచారం

పొదలకూరు : మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి మద్దతుగా ఆయన కుమార్తె కాకాణి పూజిత పొదలకూరులో ప్రచారం నిర్వహిస్తున్నారు. పట్టణంలోని విశ్వేశ్వరపురం కాలనీ, నరసారెడ్డి కాలనీ, బాలాజీ నగర్ లలో గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారం జరిపారు.కార్యక్రమంలో పొదల కూరు జడ్పిటిసి తెనాలి నిర్మల ,ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులు రెడ్డి, మండల వైకాపా నాయకులు మద్దిరెడ్డి రమణారెడ్డి, అంజాద్, సతీష్ కుమార్ రెడ్డి ఉన్నారు.

కూటమికి మద్దతు : ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి-కావలి

మాదిగ జాతి ప్రయోజనాలను ఎవరైతే నమ్ముకంగా..నిజాయతీగా కాపాడు తారో అలాంటి వారికి అండగా ఉండాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ముప్పంగి నాగరాజు మాదిగ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని జర్నలిస్ట్ క్లబ్ లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఎమ్మార్పీఎస్ అధినాయకుడు మంద కృష్ణ మాదిగ, ప్రతినిధుల బృందం చంద్రబాబు నాయుడుని కలిశామన్నారు. ఆయన ముందు కొన్ని డిమాండ్లను ఎమ్మార్పీఎస్ ప్రవేశపెట్టిందన్నారు. చంద్రబాబు సానుకూలంగా స్పందించారని తెలిపారు. సూరిపాక వాసుదేవరావు మాదిగ, గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ, మంద పెంచలయ్య మాదిగ పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -పొదలకూరు : అధ్యాపకులు మందలించడంతో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు ప్రయత్నించిన ఉదంతం పొదల కూరులోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జరిగింది. వివరాల మేరకు ఈ కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని నైల్ పాలిష్ తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. స్నేహితులు గమనించి అధ్యాపకులకు సమాచారం అందించడంతో వెంటనే పొదలకూరు లోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఆ విద్యార్థిని హాస్టల్ లో సెల్ ఫోన్ వాడుతుండటంతో అధ్యాపకులు మందలించినట్టు తెలిసింది. ఈ విద్యార్థిని ఈ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. ప్రస్తుతం ఆ విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని స్థానిక డాక్టర్లు తెలిపారు.

అభివృద్ధి చేస్తాం.. ఆదరించండి..


మాట్లాడుతున్న రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి-ఎఎస్‌పేట: మండలాన్ని అభివృద్ధి చేస్తాం ఆదరించండి టీడీపీ ఆత్మకూరు అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో కలిసి ఏ ఎస్ పేటలో జాయింట్ ప్రెస్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు నియోజక వర్గంలో టీడీపీ పార్టీ కన్వీనర్లు, ఇతర పార్టీ ప్రధాన కార్యదర్శులతో కలిసి పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు..తొలుత దర్గాలో పూజలు నిర్వహించామన్నారు. అంతరం భారీ ర్యాలీగా ఆనం పార్లమెంట్ అభ్యర్థి ప్రభాకర్ రెడ్డి తో కలిసి నిర్వహించారు.పెద్ద సంఖ్యలో ప్రజలు రావడంతో వీధులన్నీ జనాలతో నిండాయి. ఆనం మాట్లాడుతూ.పార్టీ ప్రతి మండల., నియోజక కేంద్రాలలో సమావేశాలు నిర్వహించ చాలని ఆదేశాలు అందాయని తెలిపారు. మండల జిల్లా నాయకులు, అన్ని గ్రామాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి కృషి అవసరం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : టిడిపి నాయకులు అందరు కలిసి సమిష్టిగా కృషి చేసి విజయం సాధిస్తామని నెల్లూరు జిల్లా టిడిపి పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నబోయిన చెంచుకిషోర్ బాబు పేర్కొన్నారు. గురువారం మొత్తం గ్రామంలో టిడిపి నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని టిడిపి నాయకులందరితో కలిసి సమిష్టిగా పనిచేసి కోవూరు టిడిపి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డిని 30 వేల మెజార్టీతో గెలిపించు కుంటామని ఆశాభావం వ్యక్తపరిచారు. గురువారం మండలంలోని టిడిపి నాయకుల సమావేశంలో ప్రశాంతి రెడ్డి ప్రసంగానికి టిడిపి నాయకులలో కొత్త ఉత్తేజం కలిగిందన్నారు. తమకున్న అపోహలన్ని ఒక ప్రసంగంతోనే పటాపంచలు అయ్యాయని అన్నారు. నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి విజయం తథ్యమన్నారు.టిడిపి నేతలు గంపల అనిల్, పల్లికొండ లక్ష్మణరావు, ఈదురు చెన్నయ్య, దేవిరెడ్డి రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

అసభ్యకర వ్యాఖ్యలపై ఖండన

ప్రజాశక్తి-కావలి : త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో మహిళా అభ్యర్థుల పట్ల అసభ్యకర పోస్టు, కామెంట్లు వ్యక్తిగత అసభ్యకర వ్యాఖ్యలుచేయడం అత్యంత గర్హనీయమని కావలి ఉమెన్స్ ఫోర్స్ సభ్యులు ఒకప్రకటనలో ఖండించారు. బజారు రౌడీల్లా పోటీలో ఉన్న వ్యక్తులపై ప్రత్యర్థి పార్టీల నేతలు"నిస్సిగ్గుగాబండ బూతులు, దిగజారుడు మాటలు పెరిగిపోవడం ఎక్కడో రౌడీరాజ్యంలో జరిగినట్లుందన్నారు. 1952లో తొలిసార్వత్రిక ఎన్నికల నుంచి ఆతర్వాత ఐదేళ్లకోసారి ,అవసరమైనప్పుడు మధ్యంతర ఎన్నికల ప్రచారాల్లోనే , ఎన్నడూ ఇలాంటి దిగజారుడు ప్రచారాలు జరగలేదన్నారు. ఆ మహిళా అభ్యర్థులపై నీచమైన కామెంట్లు శృతిమించుతున్నాయన్నారు. ఇదిమహిళాలోకాన్ని తీవ్రంగా అవమానిస్తున్నట్టుగా కావలి ఉమెన్ ఫోర్స్ భావిస్తూ తీవ్రంగా ఈ తీరును ఖండిస్తుందన్నారు. ఈ వికృత చేష్టలు చేసిన పార్టీ లను గుర్తుంచుకుని "నోటా"ను వినియోగించుకోవచ్చని రాజకీయ పార్టీలు గ్రహించాలని తెలిపారు.

సమావేశాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఈనెల 30వ తేదీన గుంటూరులో జరిగే రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని నాయకులు కోరారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో ఎన్డీఏ కూటమికి మద్దతుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ భవిష్యత్తు కార్యచరణకు గురువారం ఆత్మకూరు టౌన్ లోని శ్రీకోటేశ్వర కల్యాణ మండపంలో ఆత్మకూరు నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి నియోజకవర్గ ఇన్చార్జిలు బొద్దుకూరి మహేష్,తాటిపర్తి లక్ష్మయ్య మాదిగలు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జిల్లా ఇన్చార్జీ సూరిపాక వాసుదేవరావు మాదిగ,ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సూరిపాక ఉదయ్ కృష్ణ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు పందిటి అంబేద్కర్ మాదిగ, పాల్గొని వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్న ఎన్డీఏ కూటమికి మద్దతు విషయంలో ఈనెల 30 వ తేదీన గుంటూరులో జరిగే రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశానికి నెల్లూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గ మండలాల నుండి ఆత్మకూరు నియోజకవర్గం నుండి అత్యధిక సంఖ్యలో తరలొచ్చేలా చూడాలని తెలిపారు.



టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

సర్వేపల్లి నియోజకవర్గం తోటపల్లి గూడూరు మండలం వరిగొండ గ్రామం నుంచి సుదీర్ఘకాలంగా వైసీపీలో పని చేసిన కార్యకర్తలు గురువారం టిడిపి చేరారు. టీడీపీ సీనియర్ నాయకులు, పిఏసిఎస్ మాజీ చైర్మ న్ కోడూ రు శ్రీనివాసులు రెడ్డి (వరి గొండ చినబాబి రెడ్డి) ఆధ్వ ర్యంలో వరిగొండ బిట్-2 (రావూరువారి కం డ్రిగ) గ్రామా నికి చెందిన 40 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీ రికి మాజీ మం త్రి, సర్వేపల్లి నియో జకవర్గం టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. మండల పార్టీ అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్ రెడ్డి, కర్పూరపు శ్రీనివాసులు రెడ్డి, జానా శ్రీనివాసులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ



ప్రజాశక్తి నెల్లూరు సిటీ : పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు, సెక్టార్ అధికారులకు స్థానిక డి.కె. మహిళా కళాశాలలో ఎన్నికల శిక్షణ తరగతులను గురువారం శిక్షణ నిర్వహించారు. నెల్లూరు సిటీ అసెంబ్లీ 117 నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్ మాట్లాడుతూ చీఫ్ ఎలక్షన్ కమిషన్ వారి ఆదేశాల మేరకు, జిల్లా ఎన్నికల అధికారి సూచనల మేరకు ఈ నెల 28, 30 వ తేదీల్లో అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్స్ ద్వారా శిక్షణ తరగతులను డి.కే.మహిళా కళాశాలలో నిర్వహించి, ఎన్నికలప్పుడు చిన్న పొరపాటు జరగకుండా పి.ఓ, ఏ.పి.ఓ. ల విధివిధానాలను గురించి వివరణగా వివరిస్తూ శిక్షణలో అన్ని అంశాలపట్ల ఉత్తమ తర్ఫీదు అందిస్తున్నామన్నారు. అలాగే సందేహాలకు తావులేకుండా వివరించాలని మాస్టర్ ట్రైనర్స్ కు సూచించారు. నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మద, ఏ.ఆర్. ఓ. పి.దేవీ కుమారి, పి. వెంకట రమణ, ఏ. ఈ. ఆర్. ఓ వేంకటేశ్వర రావు, తహశీల్దార్ పద్మనాభుడు, టి.పి.ఆర్.ఓ. ప్రసాద్, మేనేజర్ ఇనాయతుల్లా ఉన్నారు.


మాజీ మంత్రి సోమిరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

'సోమిరెడ్డి'కి సన్మానం

ప్రజాశక్తి -వెంకటాచలం : మండలంలోని నిడిగుంటపాలెం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు కుంచి శ్రీనివాసులు యాదవ్ నివాసానికి మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వెళ్లారు. అనంతరం ప్రస్తుత రాజకీయాల పరిస్థితులపై చర్చించారు. కూటమి తరుపున పోటీ చేస్తున్న తనను ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా సోమిరెడ్డిని సన్మానించారు. టిడిపి తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరి రాధాకృష్ణ నాయుడు, టిడిపి యూనిట్ ఇంచార్జ్ రావూరి పద్మనాయుడు, ఓబీసీ మండల అధ్యక్షుడు అసనాపురం శ్రీనివాసులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం..

ప్రజాశక్తి-కావలి


మాట్లాడుతున్న బీద రవిచంద్ర

మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపింది తెలుగుదేశం ప్రభుత్వం మాత్రమేనని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర అన్నారు. గురువారం కావలి టిడిపి కార్యాలయంలో టీడీపీ – జనసేన ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డితో బోగోలు మండలం చెన్నా రాయుని పాలెం పంచాయతీ లోని తాటిచెట్లపాలెం, పాతపాలెం, కొత్తూరుగ్రామ మత్స్యకారులు కలిసి తమ మద్దతు తెలిపి, తమ గ్రామాలకు రావాలని కోరారు. తప్పకుండా మత్స్యకార గ్రామాల్లో పర్యటిస్తానని, సమస్యలు తెలుసుకుంటానని క్రిష్ణారెడ్డి వారికి హామీ ఇచ్చారు. టిడిపి జాతీయప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎప్పుడు మత్స్యకారులకు అండగా ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యేగా తనకు ఒక అవకాశం కల్పించాలని, ఎంపిగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ని గెలిపించాలని ఆయన కోరారు.కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పదేళ్ల వైసిపిలో ఉండి అనేక ఇబ్బందులు పడ్డానని, సామాన్య కార్యకర్త కంటేహీనంగా అవమానించారని తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు బీద గిరిధర్, కండ్లగుంట మధుబాబు నాయుడు, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, మాలేపాటి నాగేశ్వరరావు, మాజీ ఆప్కాబ్ చైర్మన్ కొండూరు పోలిశెట్టి ఉన్నారు.

అందని 'విద్యా దీవెన' నిధులు

ప్రజాశక్తి-కావలి : వసతిదీవెన, విద్యాదీవెన పథక పోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులపాల వుతున్నారని," జగనన్న సాయం చేయి" అని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని జర్నలిస్టుక్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి మాట్లాడుతూ ఈనెల 5వ తేదీన బటన్ నొక్కి, వసతి దీవెన విద్యాదీవెన ఇస్తున్నట్లు చెప్పినారని తెలిపారు. అవి తల్లిదండ్రుల అకౌంట్లో పడక పోవడం వలన అనేకమంది తల్లిదండ్రులు అప్పుల పాలై వడ్డీలకు తెచ్చి కాలేజీ యాజమాన్యానికి డబ్బులు కడుతున్నారని తెలిపారు. డబ్బులు కడితేనే హాల్‌టిక్కెట్లు ఇస్తామని యాజమాన్యాలు చెబుతున్నారని తెలియజేశారు. వసతిదీవెన, విద్యాదీవెన గురించి తమకు తెలియదని మీ అకౌంట్లో పడినప్పుడు తీసుకొని రండని తెలుపుతున్నారని తెలిపారు. ఫీజులుచెల్లించండని చెబుతుండటంతో ఇంజినీరింగ్, ప్రొఫెషనల్ కోర్సులు చేసే పిల్లల కోసం వారి తల్లిదండ్రులు అప్పులు చేసి పంపిస్తున్నారని తెలిపారు. బటన్ నొక్కి డబ్బులు పడక పోవడం వలన ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. జరుగు మల్లి విజయరత్నం, చౌటూరి వెంకట రత్నం, జెడ్డా వాసు, గోళ్ల తిరుపతి, పాల్గొన్నారు.